కథానిక

# చెడిన ఫోను

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

హఠాత్తుగా మావాడు సెలవుపెట్టేసి ఎక్కడికో వెళ్ళిపోయేడని విని చాలా ఆశ్చర్యపడ్డాను. మొన్న సాయంత్రందాకా పిడుగులాగ పని చేస్తూచేస్తూ, మార్చి నెలలో (ఈ నెల వాడి ఆఫీసుకి చాలా ముఖ్యమైనది. ఆడవాళ్ళకి శ్రావణం లాటిదనీ చెప్పవచ్చు) వాడి ప్రాణస్నేహితుడినైన నాతో చెప్పకుండా ఇలా ఉడాయించాడంటే ఇంక ఆశ్చర్యపడక పోవడం ఎలాగ?

"ఎక్కడికి వెళ్ళాడు?" అని సావిత్రిని అడిగాను.

"ఏమో" నన్నది

"ఎందుచేత?" అన్నాను.

"ఏమో" అన్నది,

"నువ్వేమైనా కొట్టావా?" అన్నాను ఆ అమ్మాయి తత్వం కాస్త యెరిగి ఉన్నాను కనక. తెలిసిన విషయం చెప్పేసరికి మూడు చెరువుల నీళ్లు తాగిస్తుంది. తెలియని విషయం చెప్పడానికి త్రాగించే చెరువుల సంఖ్య లెక్కలేదు.

"వాడిని కొట్టడమే నాపని. వెళ్ళి వాడినే అడుగే యెన్ని తిన్నాడో" అని, లోపలికి వెళ్ళిపోయింది.

వాడి విషయం సావిత్రికి తెలియకుండా పోవడం నా ఆశ్చర్యం యెక్కువ కావడానికి కారణమయింది. ఆవిడతో చెప్పకుండా వాడు ఏపనీ చెయ్యడే?

వాళ్ళ గుమాస్తాలనే ఇంక అడగాల్సి వచ్చింది. సాయంత్రం అయ్యరు హోటల్లో నంబియార్ కనిపించాడు.

"ఈవేళ శ్రీపతి ఆఫీసుకి వచ్చాడా?" అన్నాను కాజువల్ గా.

"లేదుసార్. మీకు తెలిసి ఉంటుందని తలుస్తూంటిమి మీకూ తెలీదా?" అన్నాడు. అని ఊరుకోక నవ్వుతున్నాడు.

నాకేమీ బోధపడలేదు.

"తెలిసే దేమిటి?"

నంబియార్ తన మళయాళపు తెలుగుతో నన్ను చంపక పూర్వమే అదృష్టవశాత్తూ గజేంద్రరావు వచ్చాడు.

అతన్ని చూస్తూనే నంబియార్ నవ్వుతూ "శ్రీపతి యూడపోయివాడని అడుగుతారు" అన్నాడు నన్ను చూపుతూ.

"ఎక్కడికి వెళ్ళాడండీ శ్రీపతి?" అంటూ గజేంద్రరావు నావైపు తిరిగాడు.

నన్ను వీళ్ళంతా ఫూల్ ని చేస్తున్నారేమోనని అనుమానం పుట్టింది. కొంచెం సీరియస్ గా గజేంద్రంతో "మీరు తెలిసి ఉంటే చెప్పరాదా? నాకేం తెలీదు. మొన్న సాయంత్రంనించీ వాడి జాడ తెలీలేదు" అన్నాను.

గజేంద్రం నా అవస్థ చూసి "ఐతే నిజంగా మీకు తెలీదన్న మాట. పోనీ ముందు కథ ఐనా తెలుసునా?" అన్నాడు.

"అసలు ఏమీ ఎరగనండీ. ఆఫీసులో ఏమైనా గొడవ జరిగిందా?" అన్నాను.

గజేంద్రరావు రోస్టు దోసెకు ఆర్డరిచ్చి చెప్పడం సాగించాడు.

"అసలు కథ ఇదండీ. మా హెడ్ క్లర్కు చాలా చికాకైనవాడు పోగయ్యాడు. ఇతను దాపురించిన దగ్గరనించీ ఓవర్ వర్కూ, చీవాట్లూ, సస్పెన్షన్లూ, డిస్మిసలూ ప్రారంభమయాయి. అందరం కాస్త పెద్దవాళ్లమే. కాస్త అలవాటుపడిన వాళ్లం. ఎలాగో సర్దుకుంటున్నాము. కాని, కాస్త కుర్రరక్తం కదా, శ్రీపతి మొదటినుంచి కోపం తెచ్చుకుంటూనే ఉన్నాడు. ఎలాగో అతన్ని తిరగబడకుండా ఆపుతున్నాము.

"ఆఫీసులో ఎలాగో అణగి ఉన్నా అతను హెడ్ క్లర్కు విశేషాలు అన్నలోపాలకోసం గాలిస్తూనే ఉన్నాడు. ఆ హెడ్ క్లర్కు

అసలే ముసలివాడు. ఎడమ కాలికి మూడు వేళ్లూ కుడి కాలికి ఆరు వేళ్లూ ఉన్నాయట. అతని పెద్ద కూతురు పది సంవత్సరాలై ఒక క్రిస్టియన్ భక్తుడిని లేవదీసుకుని పోయిందట. ఇంటి దగ్గర అతని భార్య హస్తకములాలు తరచు అతని కర్ణాలమీదనే ఉంటూంటాయిట.

“ఈ విశేషాలన్నీ ఎలాగో లాగేశాడు. పగ సాధించాలని చూస్తాడు. ఎలాగ ప్రయత్నించాడో, చావడానికి లేని తీరుబడి అతనికెలాగ వచ్చిందో. ఆ మట్టున ఈ విశేషాలన్నీ ఈ ఫ్రాకులో ఆ యిద్దరికీ అంటే అడిగినవాళ్ళకి, అడగనివాళ్లకి చెప్పేశాడు. (అలా అని గజేంద్రం చిన్న చిరునవ్వు పారేశాడు తన “విట్టు”కి కాని, ఆ విట్టుకి మేం నవ్వకపోగా ఆ అవమానం పోగొట్టడానికి వచ్చిన దోసెని తొందరగా తుంచి నోటిలో పెట్టుకుని ఆ వేడి భరించలేక మంచినీళ్లు తాగి, మళ్ళా ఉపక్రమించాడు దోసెని చల్లారనిస్తూ)

“అయినా సరే కాని, అనంతరావు మాత్రం లొంగలేదండీ ఆఫీసుకి వస్తూనే వున్నాడు. మేమంతా ఓవర్ వర్కుకి చీవాట్లు పంచుకొని అనుభవిస్తూనే ఉన్నాం. నేచురల్‌గా శ్రీపతి కోపం ఎక్కువైంది. అతన్ని కాయకష్టులా నొక్కిపెడుతూనే ఉన్నాను తొందరపడితే ప్రమాదం అని” (ఈసారి సాధ్యమైనంత పెద్ద ముక్క పళ్ళెంలోంచి తీసి, దాన్ని చట్నిలో పవిత్రం చేసి నోట్లో వేసుకున్నాడు అంచేత ఆ తరువాత ఏమిటి చెప్పాలో అతను ఆలోచించుకోగలిగాడు.)

ఆ గేప్ పూర్తి చెయ్యడానికి, ఊరుకుంటే బొత్తిగా బాగుండదని నేను “ఏమైనా పెద్దలు పెద్దలే లెండి. వేడి రక్తంతో కుర్రాళ్ళేమిటి చెయ్యగలరు?” అన్నాను వీలైనంత సిన్సియరుగా.

నేనామాట అనడం ఏమి ఎఫెక్టు ఇచ్చిందో తెలీదు కాని, అతను తొందరగా ఇంకో నాల్గు సార్లలో ఆ దోసెని పూర్తి చేసి, చేతులు కడిగేసుకుని, మంచినీళ్లు తాగి, కాఫీ ఆర్డర్ చేసి, మళ్ళా సంభాషణలోకి దిగాడు.

“మాస్టారూ! మీరలాగ అంటారా? ఏం పెద్దరికం అని చెప్పుకోమంటారు? నిన్న సాయంత్రం రాయప్పగారింటిదగ్గర ఏమైందో తెలుసునా? వాళ్ళ తమ్ముడు ఆడుకుంటూ ఆడుకుంటూ ఆ పక్క ఇంటి వాళ్ళ పిల్లని చితకొట్టాడు. పెద్దవాడినికదా ఊరుకుంటే బాగుండదని రెండు చీవాట్లేశానని, రాయప్ప చాల్లే పెద్దరికం నీపని చూసుకో అనేశాడు. నిలువునా చచ్చిపోయానంటే నమ్మండి.”

ఎదురుగా కూర్చుని హాయిగా కాఫీ తాగుతున్న అతని మరణాన్ని నమ్మడం నాచేత కాలేదు. ఎలాగైనా అసలు కథకి మనిషిని లాగుదామని ప్రయత్నిస్తూ, “వాడొట్టి వెధవ లెండి సరే కాని, చివరికి శ్రీపతి మాట ఏమైంది?” అన్నాను.

ప్రయాసతో ఆ కాఫీ ముగించి సిగరెట్టు వెలిగించి గజేంద్రరావు కథనం సాగించాడు.

“ఆ. చివరికొకనాడు అందరమూ ఆఫీసులో ఆయన సెలవు పెట్టాడు కదా అని ఓ చిన్న కాన్ఫరెన్సు చేసుకుని విషయం చర్చిస్తున్నాం.

“ఇంతటిలో మరేమిటి అనుకున్నాడో కాని, శ్రీపతి అమాంతం టెలిఫోన్ తీశాడు. హెడ్ క్లర్కుని పిలిచి, అతని గురించిన విషయాలన్నీ తమకి తెల్సునని, అతని కూతురు ఎవడితో లేచిపోయిందో, అతని భార్య అతని చెవులు ఎందుకు నులిమేస్తుందో, అతని కే కాలికి ఎన్ని వేళ్ళో ఇవన్నీ చాలా గంభీరంగా చెప్పి, “ఇన్ని లోపాలుంచుకొని, ఏ ముఖం పెట్టుకుని మమ్మల్ని ఓవర్ వర్కు చేయించడమూ, వ్యక్తి పరంగా చీవాట్లు పెట్టడమూ చేస్తావు? జాగ్రత్త. శ్రీపతిని మరిచిపోకు” అన్నాడు. మేమంతా అతని వాక్ప్రవాహానికి తెల్లబోయామనుకోండి. నవ్వుతూ రిసీవరు పెట్టేసి మా దగ్గరకి వచ్చి కూర్చున్నాడు. అతని తొందరికి తిట్టిన వాళ్లు తిట్టాము, ధైర్యానికి అభినందించాము. కాని చివరికి అతను నవ్వుతూ కూర్చున్నాడు.

“ఆ సాయంత్రం దాకా అతను మామూలుగా ఉన్నాడు. మర్నాడు ఉదయం అతను ఆఫీసుకి రాలేదు హెడ్‌క్లర్కూ రాలేదు. ఎవరి విషయమూ తెలియక మేం తెల్లబోతున్నాం. మీకు తెలుస్తుంది. మీరు చెప్తాననుకుంటే వీళూ ఏమీ తెలియదంటున్నారు!” అని ముగించాడు.

నాకెంత వరకూ బోధపడింది కాని, ఊరునించి పారిపోయేంతగా భయపడేవాడు నిముషంలో ఎలాగ సాహసించి చీవాట్లు పెట్టాడో, సాయంత్రందాకా నవ్వుతూ ఎలాగ ఉన్నాడో, హెడ్‌క్లర్కు యెందుకు సెలవు పెట్టాడో — ఈ విషయాలన్నీ అర్థం కాలేదు. అసలు మహాశ్చర్యం వాడికా ధైర్యం ఎలా వచ్చిందీ అంత హఠాత్తుగా ఎలాగ పోయిందీ అని.

కాని వాళ్ళంతా నాకన్నా ఆధ్వాన్నంగా ఉన్నారు. అందుకని వాళ్ళని వదిలి ఇంటికి వెళ్ళిపోయాను.

నాలుగు రోజులయాక రోడ్డుమీంచి వచ్చేస్తోంటే సావిత్రి పిలిచి, "ఒకసారి లోపలికి దయచెయ్యండి" అన్నది.

ఎందుకోనని వెళ్ళాను. వెనకాలే వస్తూ సావిత్రి మేడమీద గదికి తోవ చూపింది. వెళ్ళాను. లోపల — శ్రీపతి.

"ఎక్కడికి పోయావురా?" అన్నాను గట్టిగా.

వాడు చాలా సీరియస్‌గా ఉన్నా, జాలికరంగా ఉన్నాడు. తలవంచుకుని, "ఒకసారి తాతగారి ఇంటికి వెళ్ళాను" అన్నాడు.

వాణ్ణి కథ అంతా చెప్పమన్నాను. చెప్పనన్నాడు. బ్రతిమాలాను. ఒప్పుకున్నాడు.

అసలు జరిగిన సంగతి ఇది. ఆనాడు ఉదయం వీడు ఆఫీసుకి కొంచెం పెందరాళే వెళ్ళాడు. అక్కడికి వాడి ఫ్రెండ్ టెలిఫోన్ రిపేరర్ వచ్చి, ఫోన్ టెస్ట్ చేస్తూ మావాడి ప్రశ్నకి సమాధానంగా కనెక్షన్స్ చెడ్డాయని చెప్పాడట.

ఆ మధ్యాహ్నం వాళ్ళందరినీ ఫూల్స్ చెయ్యాలని, కనెక్షన్ యెలాగా లేదుకదా అని శ్రీపతి ఫోన్ తీసి మాట్లాడేడలాగ.

కాని ఆ సాయంత్రం టెలిఫోను రిపేరరు మళ్ళా కనిపించితే, మావాడు తెలుసుకోడాని లైను బాగుపడిందా అని అడిగాడట "ఉదయమే బాగుపడింది" అని చెప్పాడట. సరిగ్గా మావాడు ఫోన్ తీసేసరికే హెడ్‌క్లర్కుకి కనెక్షన్ ఇవ్వమన్న ఫోను పనిచెయ్యడం లేదన్న సంగతి మావాడికి తెలియలేదు.

ఆ సాయంత్రం శ్రీపతి హెడ్‌క్లర్కుకి జడిసి తాతగారి ఇంటికి బయలుదేరాడట.

"ఇది కథ. ఏమిటి చెయ్యమంటావురా?" అన్నాడు శ్రీపతి.

బుర్ర గోక్కున్నాను. సావిత్రి కాఫీ తెచ్చి ఇస్తూ "కాఫీ తాగి ఆలోచిస్తే సరి" అని నవ్వసాగింది.

నా కనుమానం ఎక్కువైంది ఏదో వుందని. బలవంతాన బయట పెట్టించాను.

"వాళ్ళమ్మాయి చెప్పింది వీళ్ళ హెడ్‌క్లర్కు టెలిగ్రాం ఇచ్చి బదిలీ చేయించుకున్నాడట ఈ వూరునుంచి ఉదయం ఆర్డర్లు వచ్చాయట" అంది సావిత్రి.

మేం ఒకళ్ళవేపు ఒకళ్ళం చూసుకుంటున్నాం. సావిత్రి నవ్వుతోంది.

---

ధగధగా మెరిసిపోతున్న ఆ కొంటె కోణంగి ఇంటరు విద్యార్థి ప్రవర్తన సహించలేక చివరకి ప్రిన్సిపాలు అడిగాడు: "నువ్వు కాలేజీలో చేరింది చదువుకుందికి కాదు...ఆమాత్రానికి ఇంకేం ఉద్ధరిస్తావని మీవాళ్లు నిన్నిక్కడికి పంపారు?"

విద్యార్థి సమాధానం: అదే నాకూ అంతు చిక్కకుండా ఉంది సార్! మా అమ్మ యేమో నేను కలక్టరు ఉద్యోగం చెయ్యడానికి చదువుకోమంది. అల్లరి చిల్లరగా తిరగడానికి తప్ప యింకెందుకూ పనికిరానని మామయ్య అంటాడు. నేనొక డబ్బున్న స్నేహితుణ్ణి కాలేజీలో పడితే వాణ్ణి పెళ్ళాడుదామని మా చెల్లి ఆశ. నా చదువుతో ఆస్తి దివాలా అవుతోందని నాన్న బెంగ. అంచేత కాలేజీలో ఎందుకు చేరానో ఎలా చెప్పగలను సార్?"